

పూర్వ వైభవం రాలే..

భీమ్‌గల్ డిపో పున:ప్రారంభమైనా బస్సులను కేటాయించకపోవడంతో వెలవెలబోతుంది. నైట్‌హాల్ట్ బస్సులకు షెల్టర్‌గా మారింది

- 8లో ▸



వన్యప్రాణుల దాహం తీరేదెలా?

వేసవి కారణంగా అడవుల్లో నీటి నిల్వలు తగ్గడంతో వన్యప్రాణులు దాహం తీర్చుకోవడానికి అల్లాడుతున్నాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
36.1 /20.9

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు ఐపీఎల్ 'ఫ్యాన్ పార్క్'

- ఉమెన్స్ కాలేజ్ మైదానంలో భారీ స్క్రీన్ ఏర్పాటు



నిజామాబాద్‌నాగారం: క్రికెట్ అభిమానుల కోసం ఐపీఎల్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాన్ని భారీ స్క్రీన్‌పై ప్రదర్శిస్తున్నట్లు బీసీసీఐ ప్రతినిధి గాజుల మోహన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో నగరంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో ఫ్యాన్ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ ఐపీఎల్ సీజన్‌లో దేశ వ్యాప్తంగా 50 నగరాల్లో ఫ్యాన్ పార్కులను నిర్వహిస్తుండగా, అందులో నిజామాబాద్ కూడా ఉన్నట్లు తెలిపారు. ఫ్యాన్ పార్కులోకి ప్రవేశం ఉచితమని, క్రీడాకారులు, అభిమానులు తరలిరావాలని కోరారు.

ముచ్చటగా మూడేళ్లు పట్టింది

- పూర్తికావొస్తున్న ఎస్సారెస్పీ వరద గేట్ల మరమ్మతులు
- రూ.17.5 కోట్లతో రిపేర్లు



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదిలేందుకు నిర్మించిన వరద గేట్ల మరమ్మతులు ఎట్టకేలకు పూర్తికావొచ్చాయి. మరో 15 రోజుల్లో పెయింటింగ్‌తో సహా గేట్ల మరమ్మతులు పూర్తవుతాయని ప్రాజెక్ట్ అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో ఏర్పాటు చేసిన వరద గేట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో పూర్తిగా చెడిపోయాయి. దీంతో 2022లో గత ప్రభుత్వం గేట్ల మరమ్మతులకు రూ.17.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. అప్పటి నుంచే పనులు ప్రారంభించింది. కానీ, వర్షాలు, వరదల సమయంలో గేట్ల మరమ్మతులు చేపట్టడం కుదరకపోవడంతో పనులు ఆగుతూ.. సాగుతూ వచ్చాయి. ఇటీవల మెకానికల్ పనులు పూర్తికాగా, గేట్లకు పేయింటింగ్ వేస్తున్నారు. గేట్ల టన్‌బక్కెలు, రోప్‌లు కొత్తవి మార్చారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వరద గేట్ల మరమ్మతులు పూర్తి కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఫ్లడ్ సీజన్‌కు ముందే గేట్ల నిర్వహణ సరిగా చేపట్టాలని కోరుతున్నారు. పెయింటింగ్ పనులు వేగవంతం చేస్తామని ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి తెలిపారు.

సెలవుల్లో పశుసంవర్ధక శాఖ జేడీ

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ జగన్నాథచారి దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆయన రెండు నెలలపాటు సెలవు పెట్టారు. ఇన్‌చార్జి జేడీగా బోధన్ ఏడీ రోహిత్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జగన్నాథచారి సెలవులు పూర్తయ్యే వరకు రోహిత్ రెడ్డి ఇన్‌చార్జి జేడీగా కొనసాగనున్నారు.

765 డీ జాతీయ రహదారి విస్తరణలో డిజైన్ లోపాలతో నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువలు మాయమవుతున్నాయి. మురుగునీటి కాలువల తొలగింపుతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. జిల్లాలోని రుద్రూర్ నుంచి మెదక్ వరకు జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండల కేంద్రం వద్ద నిజాంసాగర్ 25వ సబ్ కెనాల్ నుంచి వచ్చే డిస్ట్రిబ్యూటరీ కాలువ పూర్తిగా కనుమరుగైంది. అంకోల్ క్యాంప్ గ్రామం వద్ద మరో కాలువ సైతం కనుమరుగు కానుంది. వీటి కింద సుమారు 600 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

SAKSHI FOCUS సాక్షి ఫోకస్

సోమేశ్వర్ గ్రామం వద్ద పూర్తయిన జాతీయ రహదారి సైడ్ డ్రెయిన్ పనులు



పంట కాలువలు మాయం

- 765 డీ జాతీయ రహదారి నిర్మాణం డిజైన్‌లో లోపాలు
- ప్రత్యామ్నాయ కాలువలు తీయాలంటున్న రైతులు
- మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్య వస్తే సర్వీస్‌రోడ్డు తవ్వాల్సిందే
- డీపీఆర్ తయారీలో తప్పిదాలతో తప్పని సమస్యలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అభివృద్ధికి మార్గాలు రహదారులు. అయితే ఈ రహదారుల నిర్మాణానికి చేసిన డిజైన్‌లలో ఏ చిన్న లోపం ఉన్నా అనేక సమస్యలు తలెత్తుతాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లోని రుద్రూర్ నుంచి మెదక్ వరకు నిర్మిస్తున్న 765 డీ జాతీయ రహదారి డిజైన్‌లో లోపాలతో రైతులకు, పలు గ్రామాల వాసులకు ఇబ్బందులు తలెత్తాయి. డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారు చేసే సమయంలో చేసిన తప్పిదాలతో బాన్సువాడ నియోజకవర్గంలో పలు చోట్ల నిజాంసాగర్ పంట కాలువలు మాయమయ్యాయి. కొన్ని గ్రామాల వద్ద డ్రెయినేజీలు పోయాయి. గతంలో ఉన్న రోడ్డును ఇటీవల జాతీయ రహదారిగా మార్చాక మరింత వెడల్పుగా నిర్మిస్తున్నారు.

మొత్తం 30 మీటర్లు కాగా ఇందులో 10 మీటర్లు ప్రధాన రహదారి. కాగా ఇరువైపులా 2.5 మీటర్ల చొప్పున (మొత్తం 5 మీటర్లు) వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా బయటకు వెళ్లేందుకు గాను డ్రెయిన్లు, డ్రెయిన్ల తరువాత ఇరువైపులా 7 మీటర్ల చొప్పున సర్వీస్ రోడ్డు (మొత్తం రెండువైపులా కలిపి 14 మీటర్లు) నిర్మిస్తున్నారు. అయితే ఈ రహదారి విస్తరణలో నస్రుల్లాబాద్ మండల కేంద్రం వద్ద నిజాంసాగర్ 25వ సబ్ కెనాల్ నుంచి వచ్చే డిస్ట్రిబ్యూటరీ కాలువ పూర్తిగా కనుమరుగైంది. మరోవైపు ఇదే మండలంలోని అంకోల్ క్యాంప్ గ్రామం వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువ సైతం కనుమరుగు కానుంది. 500 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ కాలువలు కనుమరుగవుతుండడంతో రైతులకు నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. వీటి కింది భాగంలో సుమారు 600 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయా గ్రామాల మురుగునీటి కాలువలు సైతం తొలగించారు. దీంతో సమస్యలు తప్పడంలేదని గ్రామాల ప్రజలు చెబుతున్నారు.



నస్రుల్లాబాద్ వద్ద తాత్కాలికంగా తవ్విన పంట కాలువ

అంకోల్ క్యాంప్ వద్ద ప్రస్తుతమున్న పంట కాలువ. ఇది కూడా తొలగించనున్నారు

మిషన్ భగీరథ పైపులైన్ పైనే..

ఇక మిషన్ భగీరథ పైపులైన్లు ఉన్న చోటే పైభాగంలో జాతీయ రహదారికి సర్వీస్ రోడ్డు వేస్తున్నారు. దీంతో ఈ మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, ఇతర రిపేర్లు చేయాల్సి వస్తే సర్వీసు రోడ్లను తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమస్యలను పట్టించుకోకుండా డీపీఆర్ తయారు చేయడమంటే శాఖల మధ్య ఏమాత్రం సమన్వయం లేకపోవడమేనని ఈ గ్రామాల ప్రజలు అంటున్నారు.

పరిష్కారం చూపాలి



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన పనులతో కొన్ని సమస్యలు తలెత్తాయి. మా ప్రాంతంలో 600 ఎకరాలకు సాగునీరందించే పంట కాలువ, గ్రామం నుంచి మురుగు నీరు బయటకు వెళ్లే డ్రెయినేజీలు లేకుండా పోయాయి. ఇక మిషన్ భగీరథ పైప్‌లైన్లు సర్వీసు రోడ్డు కిందికి వెళ్లాయి. భవిష్యత్తులో పైపులైన్‌లలో సమస్యలు ఏర్పడితే బీటీ రోడ్డు మొత్తం తవ్వాల్సిన పరిస్థితి. అప్పుడు అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని సమస్యలకు పరిష్కారం చూపాలి.

– వెంకటరమణ, మాజీ సర్పంచ్, అంకోల్ క్యాంప్



అంకోల్ క్యాంప్ గ్రామానికి వెళ్లే ఇంట్రావిలేజ్ పైప్‌లైన్



కామిశెట్టిపల్లి వద్ద ఉన్న 765డీ జాతీయ రహదారి

రికార్డులు పక్కాగా నమోదు చేయాలి

- నగరం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలకు కేటాయింపు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- రెంజల్‌లో కేంద్రాల పరిశీలన



దండిగుట్టలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

రెంజల్(బోధన్): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణకు సంబంధించిన రికార్డులను పక్కాగా నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు నిర్వాహకులకు సూచించారు. జిల్లాలో 50 శాతం కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించినట్లు తెలిపారు. రెంజల్ మండలం దూపల్లి, దండిగుట్ట, రెంజల్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాల నిర్వహణ, రికార్డుల నమోదులను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా 700 కేంద్రాలను ప్రారంభించాలని నిర్ణయించామని, ఇప్పటి వరకు 100 కేంద్రాల్లో కొనుగోళ్లు మొదలైనట్లు తెలిపారు. రైతులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నా రు. దూపల్లి, దండిగుట్ట, రెంజల్ కేంద్రాల్లో ట్రక్‌షీట్‌లు అందించకపోవడం, రిజిస్టర్‌లలో వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంపై కలెక్టర్ అ సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రక్‌షీట్లు వచ్చిన వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేసి రైతుల నుంచి సేకరించిన ధాన్యం రకం, ఎన్ని క్వింటాళ్లో స్పష్టంగా తెలిసేలా రసీదులు అందించాలన్నారు. దీంతో బిల్లుల చెల్లింపుల్లో తేడాలు రాకుండా ఉంటుందన్నారు. మహిళా సంఘాలకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో వింద్ సీఈవోలు, ఏఈవోలు సహకరించాలన్నారు. ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, హమాలీలు, లారీల కొరత రాకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవిందరెడ్డి, డీసీవో శ్రీనివాస్, డీపీఎం సాయిలు, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఏపీఎం చిన్నయ్య ఉన్నారు.

ఇందూరు అభివృద్ధికి సహకరిస్తాం

- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్
- ఢిల్లీలో కలిసిన నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు



ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మున్సిపాలిటీలు, ఇందూరు నగర అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ప్రధాన కార్యదర్శి కటికితల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఢిల్లీలోని నిర్మాణ్ భవన్‌లో ఆయనను ఎంపీ అర్వింద్ , ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, డాక్టర్ సంజయ్‌కుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలు, ఇందూరు అర్బన్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా నగర సుందరీకరణ, రోడ్లు, పార్కులు తదితర నిర్మాణాలపై చర్చించినట్లు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ తెలిపారు. అభివృద్ధి పనులకు కేంద్ర నిధులు వచ్చేలా కృషి చేస్తానని శ్రీనివాస్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరెపల్లి సత్యనారాయణ, జ్యోతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ సీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఢిల్లీ సీఎం రేఖా గుప్తాను ఎంపీ అర్వింద్ ధర్మపురి, ఎమ్మెల్యే ధన్‌పాల్ ఢిల్లీ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

సన్నబియ్యం పంపిణీ సజావుగా సాగాలి

- అధికారులు ప్రతినెలా పర్యవేక్షించాలి
- అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- రేపు నిరుపేదలతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేయాలి
- జిల్లా కలెక్టర్లకు నిర్దేశించిన మంత్రి ఉత్తమ్, సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్నబియ్యం పంపిణీ పథకాన్ని పకడ్బందీగా పర్యవేక్షించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్ జిల్లా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సన్నబియ్యం పంపిణీపై సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని సుమారు 80 నుంచి 84 శాతం మంది నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం అందుతుందని స్పష్టం చేశారు. అన్ని జిల్లాల్లో ప్రతి నెలా సజావుగా సన్నబియ్యం పంపిణీ జరిగేలా అంకిత భావంతో పనిచేయాలని హితవు పలికారు. ఇదివరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి కిలో బియ్యానికి రూ.40 పైగా వెచ్చించి ప్రజలకు ఉచితంగా సరఫరా చేశాయని, 70 నుంచి 80 శాతం వరకు ఆ బియ్యాన్ని ప్రజలు తినేవారు కాదని, రీసైక్లింగ్ ద్వారా కోళ్ల ఫారాలు, ఇతర అవసరాలకు తరలివెళ్లేదని మంత్రి అన్నారు. ప్రస్తుతం సన్నబియ్యాన్ని ప్రజలు సంతోషంగా స్వీకరిస్తున్నారన్నారు. ప్రతి రేషన్ డీలర్ వద్ద కార్డుల్లోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా సన్నబియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని, ఎక్కడైనా అవినీతి, అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 6న సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలంలో సన్నబియ్యం స్వీకరించిన దళిత, గిరిజన కుటుంబాలతో కలిసి భోజనం చేస్తారని తెలిపారు. జిల్లాల్లో కూడా వీలైతే ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, నిరుపేదలతో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేయాలని, పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, మెప్మా పీడీ రాజేందర్ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

- నిజామాబాద్‌లో నలుగురు, ఆర్మూర్‌లో ముగ్గురు
- ఆర్మూర్‌లో 34 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ పోతరాజు సాయిచైతన్య



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ పోతరాజు సాయి చైతన్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్, ఆర్మూర్‌లోని బెట్టింగ్ ముఠాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్‌లో బెట్టింగ్ ముఠాకు చెందిన మొత్తం ఏడుగురిని పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సీపీ పోతరాజు సాయిచైతన్య శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న నగరంలోని ఆటోనగర్ భారతీరాణి కాలనీకి చెందిన షేక్ ముజీబ్ అహ్మద్ ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఐదో టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ముజీబ్ అహ్మద్‌తోపాటు బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న షేక్ నదీం, షేక్ జునైద్, షేక్ రహాన్‌ను అరెస్టు చేశారు.

ముజీబ్‌కు రెండేళ్ల క్రితం సాలూర మండలానికి చెందిన షకీల్ ద్వారా నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌కు చెందిన బెట్టింగ్ మాస్టర్ సచిన్ పరిచయమయ్యాడు. ఈజీ మనీకి ఆశపడి ముజీబ్ సచిన్ ద్వారా ఏజెంట్‌గా చేరాడు. సచిన్‌పైన ఉండే సూపర్ మాస్టర్ ద్వారా ఆన్‌లైన్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాడు. అనంతరం సుమారు 1000 మంది అమాయకులకు ఆశచూపి బెట్టింగ్‌లోకి దించాడు. యూజర్స్ డిపాజిట్ చేసిన డబ్బు ఏజెంట్ ద్వారా మాస్టర్‌కు చేరి, అనంతరం మాస్టర్ నుంచి ఏజెంట్‌కు 7 శాతం కమీషన్ వస్తుంది. ఇందులో 200 మంది బెట్టింగ్‌కు పాల్పడగా, ఐపీఎల్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.88 లక్షల లావాదేవీలు జరిగాయన్నారు. ఈ కేసులో సాలూరకు చెందిన షకీల్, ఆటోనగర్‌కు చెందిన షేక్ నజీబ్, నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌కు చెందిన సచిన్, ట్రావెల్స్ యజమాని రమేశ్ పరారీలో ఉన్నారని సీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ. 50 వేలు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు పాసుబుక్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన నార్త్ సీఐ బూక శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సైలు గంగాధర్, లక్ష్మయ్యను సీపీ అభినందించారు.

పరారీలో ఐదుగురు..

ఆర్మూర్ పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఎనిమిది మందిని గుర్తించి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. హర్యానా రాష్ట్రం మంగ్‌కు చెందిన విపుల్, మహారాష్ట్రలోని బోరికి చెందిన బంటు పలాస్ అలియాస్ శేఖర్, యావత్మాల్‌కు చెందిన బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్ నిషేధిత బెట్టింగ్ యాప్‌లను వాట్సాప్‌ల ద్వారా ఆర్మూర్‌కు చెందిన గట్టడి గౌతమ్, దయాళ్ సునీల్, జాజు రంజిత్, శ్రీకాంత్ అలియాస్ శ్రీకర్‌లకు పంపించారు. దీంతో ఈ నలుగురు కొన్ని రోజుల నుంచి క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ డబ్బులు సంపాదిస్తున్నారు. బెట్టింగ్ ద్వారా వచ్చిన డబ్బును సునీల్ అమాయక ప్రజలకు అధిక వడ్డీలకు ఇచ్చి వారి బైక్‌లను తాకట్టు పెట్టించుకున్నాడు. ఈ నెల 3న సాయంత్రం 4.30 గంటలకు ఆర్మూర్‌లోని గట్టడి గౌతమ్ ఇంట్లో సునీల్, రంజిత్ బెట్టింగ్ ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.6 వేలు, తాకట్టు పెట్టుకున్న 34 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు. కాగా, ఆర్మూర్‌లోని హుస్నాబాద్‌గల్లీకి చెందిన గట్టడి శ్రీకాంత్ అలియాస్ శ్రీకర్‌తోపాటు విపుల్, బంటు పలాస్ అలియాస్ శేఖర్, బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సై మహేశ్‌ను సీపీ అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కొత్త పింఛన్లు ఎప్పుడో?

- 2022 సంవత్సరం నుంచి నిలిచిన మంజూరు ప్రక్రియ
- వితంతు, వృద్ధులకు అందని 'చేయూత'
- పెండింగ్‌లో వేలాది దరఖాస్తులు

మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు నిరీక్షణ తప్పేలా లేదు. ప్రభుత్వం మారడంతోపాటు పథకం పేరు మారినా.. అమలులో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. గత ప్రభుత్వం 2022 సెప్టెంబర్ నెలలో కొత్తగా పింఛన్లు మంజూరు చేయగా, ఆ తర్వాత కొత్త పింఛన్ల ఊసేలేదు. అర్హులైన చాలా మంది ప్రభుత్వం ఎప్పుడు పింఛన్ మంజూరు చేస్తుందా? అని ఎదురుచూస్తున్నారు.

నిరాశలో అర్హులు..

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ల సొమ్ము రెట్టింపు చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా పింఛన్ల పెంపుదల చేయలేదు. పెంపుదల మాట దేవుడెరుగు.. కొత్త పింఛన్ల మంజూరుపై ఎవరూ మాట్లాడడం లేదు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త పింఛన్ల ప్రస్తావన లేకపోవడంపై అనేక మంది నిరాశకు గురయ్యారు. వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్న వారిలో భార్య లేదా భర్త ఎవరో ఒకరు చనిపోతే ఆ పింఛన్ మాత్రం బతికి ఉన్న ఒకరికి బదిలీ చేయడం తప్ప కొత్త వాటిని మంజూరు చేయడం లేదు. జిల్లాలో 2,69,546 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. కొత్తగా వేలాది మంది దరఖాస్తు చేసుకోగా కొన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కమిషనర్ కార్యాలయంలో, మరి కొన్ని ఎంపీడీవో లాగిన్, సెర్ప్ జిల్లా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. చేయూతకు సంబంధించిన వెబ్‌సైట్ మూసి ఉండడంతో అర్హులైన వారికి కొత్త పింఛన్ల కోసం ఎక్కడ దరఖాస్తు ఇవ్వాలో అర్థం కావడం లేదు.



రెండేళ్ల నుంచి తిరుగుతున్నా..



నా భర్త గంగాధర్ రెండున్నర సంవత్సరాల కింద అనారోగ్యంతో మరణించాడు. ఆయన మరణంతో మాకు పెద్ద దిక్కు లేకుండా పోయింది. వితంతు పింఛన్ అందితే ఎంతో ఆసరాగా ఉంటుందని భావించాను. కార్యాలయాల చుట్టూ రెండేళ్ల నుంచి తిరుగుతున్నా పింఛన్ మంజూరు కావడం లేదు. – రమ్య, సుంకెట్

క్లుప్తంగా

సిర్‌పూర్‌లో గ్రేహౌండ్స్ పోలీసులకు శిక్షణ

మోపాల్: మండలంలోని సిర్‌పూర్ శివారు అటవీ ప్రాంతంలో శుక్రవారం హైదరాబాద్ నుంచి వచ్చిన గ్రే హౌండ్స్ పోలీసులకు శిక్షణనిచ్చారు. ఉదయం 4గంటలకే ప్రత్యేక వాహనాల్లో అక్కడికి చేరుకున్న సిబ్బంది కూంబింగ్, ఫైరింగ్, మందు పాతరలు, ప్రెజర్ బాంబుల నిర్వీర్యం, మావోయిస్టులు ఎదురుపడితే ఎలా వ్యవహరించాలనే అంశాలపై అధికారులు శిక్షణ ఇచ్చారు. శిక్షణ సమయంలో గ్రామస్తులు, రైతులను చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లకుండా నలువైపులా సిబ్బంది గస్తీ కాశారు. కాగా ఉదయం నుంచే కాల్పుల శబ్దాలు రావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



నిజామాబాద్ రూరల్: గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాల్దా గ్రామంలో శుక్రవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఎండాకాలంలో గ్రామాల్లో ప్రజలకు ప్రత్యేక అధికారులతోపాటు కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు ఎంత వరకు వచ్చాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయం పక్కన చలివేంద్రాన్ని ప్రారంభించారు. మండల పంచాయతీ అధికారి ఇక్బాల్, అధికారులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి డివిజన్ ఇన్‌చార్జి డీఈగా రమేష్



సుభాష్‌నగర్: ఎన్‌పీడీసీఎల్ డిచ్‌పల్లి డివిజన్ ఇన్‌చార్జి డీఈగా రమేష్‌ను నియమిస్తూ కంపెనీ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో ఇక్కడ డీఈగా విధులు నిర్వర్తించిన ఉత్తమ్ జాడే పదోన్నతిపై వరంగల్ సెక్షన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డీఈ టెక్నికల్‌గా పని చేస్తున్న రమేష్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

వన్య ప్రాణుల దాహం తీరేదెలా?

- అడవుల్లో ఖాళీగా దర్శనమిస్తున్న సాసర్ పిట్లు
- నీళ్ల కోసం పొలాల వరకు వస్తున్న జీవాలు
- పట్టించుకోని అధికారులు



కొండాపూర్ శివారులో దాహంతో అల్లాడి మృతి చెందిన ఎలుగుబంటి (ఫైల్)



సిరికొండ అడవుల్లో ఇంకా వినియోగంలోకి రాని సాసర్‌పిట్లు

సిరికొండ: వేసవి కారణంగా అడవుల్లో నీటి నిల్వలు తగ్గడంతో వన్యప్రాణులు దాహం తీర్చుకోవడానికి అల్లాడుతున్నాయి. వన్య ప్రాణుల నీటి సౌకర్యం కోసం నిర్మించిన సాసర్‌పిట్లు సైతం ఖాళీగా ఉండటంతో వన్యప్రాణులు నీళ్ల కోసం అటవీ ప్రాంతానికి సమీపంలోని పొలాల వైపు వస్తున్నాయి. దీంతో రాత్రివేళలో పొలాలకు నీళ్లు పారించడానికి వెళుతున్న రైతులు వన్యప్రాణులు కనిపించేసరికి భయాందోళనకు గురవుతున్నారు.

ఇదీ పరిస్థితి..

సిరికొండ అటవీ రేంజ్ పరిధిలోని సిరికొండ, రావుట్ల, పందిమడుగు, తూంపల్లి నాలుగు సెక్షన్ల పరిధిలో 15700 హెక్టార్లలో అడవులు విస్తరించి ఉన్నట్లు అటవీ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. 2018లో చేపట్టిన అటవీ జంతువుల గణన ప్రకారం మండలంలోని అడవుల్లో మూడు చిరుతలు, పదుల సంఖ్యలో ఎలుగుబంట్లు, వందల సంఖ్యలో నీల్‌గాయ్‌లు, అడవి పందులు, జింకలు, నక్కలు, అడవి కుక్కలు, నెమళ్లు, కోతులు ఇతర జంతువులు ఉన్నట్లు వెల్లడైంది. వేసవి కారణంగా అటవీ ప్రాంతంలోని నీటి ఒర్రెలు ఎండిపోవడంతో వాటికి నీటి ఎద్దడి నెలకొంది.

మృత్యువాత పడుతున్న జీవాలు..

జంతువుల దాహార్తిని తీర్చడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో రెండు స్క్వేర్ కిలోమీటర్ల పరిధిలో 400హెక్టార్లకు రెండు చొప్పున సాసర్ పిట్లను నిర్మించారు. మండలంలోని అటవీ ప్రాంతంలో పాతవి పది వరకు ఉండగా గత నాలుగేళ్ల క్రితం 60 కుండీలను నిర్మించారు. ఈ కుండీల్లో వారానికి ఒకసారి నీళ్లు నింపాలి. కానీ ఇప్పటికీ నీళ్లను నింపకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయాయి. ఈక్రమంలో అటవీ జంతువులు దాహార్తి తీర్చుకోవడానికి అడవుల నుంచి బయటకు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. గతంలో మైలారం గ్రామ సమీపంలో నీళ్లు తాగడానికి వచ్చిన నీల్‌గాయ్‌ని కుక్కలు వెంబడించి దాడి చేయగా మృతి చెందింది. కొండాపూర్ అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి నీళ్ల కోసం తిరిగి దాహంతో అల్లాడిపోయి చనిపోయింది. పంటలను కాపాడుకోవడానికి రైతులు విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయగా నీళ్లు తాగేందుకు వచ్చిన అడవి పందులు బలైన ఘటనలు నెలకొన్నాయి. పొలాలకు విషపు గుళికలు చల్లగా ఆ నీటిని తాగి నెమళ్లు చనిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అటవీప్రాంతంలో నీటి సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో నీళ్లు నింపుతాం

వన్యప్రాణులకు తాగడానికి నీటి సౌకర్యం కోసం త్వరలోనే సాసర్ పిట్లలో (సిమెంట్ కుండీలు) నీళ్లు నింపుతాం. గత మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. గ్రామ పంచాయతీలతో మాట్లాడి వారి ట్యాంకర్ల ద్వారా నీళ్లను పోయించేందుకు చర్యలు చేపడుతున్నాం. అడవుల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన నీటి కుంటల్లో నీళ్లు అందుబాటులో ఉన్నాయి.

– రవీందర్, సిరికొండ ఇన్‌చార్జి అటవీ రేంజ్ అధికారి

పున:ప్రారంభించినా పూర్వ వైభవం రాలే..

- భీమ్‌గల్ బస్‌డిపోకు బస్సులను కేటాయించని అధికారులు
- నైట్‌హాల్ట్‌కే పరిమితం



బస్సులు లేక వెలవెలబోతున్న భీమ్‌గల్ డిపో

మోర్తాడ్: భీమ్‌గల్ బస్సు డిపోను పున:ప్రారంభించినా బస్సులను కేటాయించకపోవడంతో వెలవెలబోతుంది. మూడు డిపోల నుంచి వచ్చే నైట్‌హాల్ట్ బస్సులకు షెల్టర్ ఇవ్వడానికి మాత్రమే డిపో ఆవరణ ఉపయోగపడుతుంది. దీంతో డిపోను పున:ప్రారంభించినా పూర్వ వైభవం రాలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మొదట ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు..

ఆర్మూర్ బస్సుడిపో పరిధిలోనే ఉన్న భీమ్‌గల్‌కు రద్దీ దృష్ట్యా ప్రత్యేక బస్ డిపో అవసరం అని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం భావించి, డిపోను మంజూరు చేసింది. ఆర్మూర్ డిపో నుంచి కొన్ని బస్సులను కేటాయించి, నిజామాబాద్, వేములవాడ, మెట్‌పల్లి, కమ్మర్‌పల్లి, ఆర్మూర్, హైదరాబాద్ రూట్లలో నడిపించారు. లాభాలు లేకపోవడం, నష్టాల భారం తప్పించడానికి అప్పట్లోనే డిపోను మూసివేశారు. 2023 సెప్టెంబర్‌లో ఈ డిపోను అప్పటి ఆర్అండ్‌బీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌లు పున:ప్రారంభించారు. కానీఇప్పటి వరకూ ఎలాంటి బస్సులను కేటాయించలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బస్సులను కేటాయించి భీమ్‌గల్ డిపోకు పూర్వ వైభవం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఆర్మూర్ డిపో పరిధిలోనే ఉంది..

భీమ్‌గల్ బస్సుడిపోకు సిబ్బంది, బస్సులు లేవు. మా ఆర్మూర్ డిపో పరిధిలోనే ఈ బస్సుడిపో కొనసాగుతుంది. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటేనే బస్సులను కేటాయించే అవకాశం ఉంది. ప్రజారవాణాకు ఇబ్బంది లేకుండా మా ప్రయత్నం మేము చేస్తున్నాం.

– రవికుమార్, డిపో మేనేజర్, ఆర్మూర్

ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు



ఎడపల్లి రేషన్ దుకాణంలో రికార్డులను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

సుభాష్‌నగర్/ఎడపల్లి: పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల రేషన్ దుకాణాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాయి. ఎడపల్లి మండలం ఠాణాకలాన్, కుర్నాపల్లి, ఎడపల్లి, ఎమ్మెస్సీ ఫారం, ఒడ్డెపల్లిలో రేషన్‌షాపుల్లో బియ్యాన్ని పరిశీలించారు. ఎమ్మెస్సీ ఫారం, ఒడ్డెపల్లిలోని రేషన్ షాపుల్లో ఉన్న బస్తాల్లో 4 కిలోల చొప్పున బియ్యం తక్కువగా వచ్చినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు గుర్తించారు. బియ్యం బస్తాలు ఎక్కడి నుంచి వచ్చాయనేది ఆరా తీశారు. పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అధికారులు, కడ్తా, కేంద్రాల్లో సమస్యలు, ఇతర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ రాజారెడ్డి, టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ శేఖర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఎస్సై శ్రీనివాస్, స్పెషల్ ఫోర్స్ డీటీ శ్రీనివాస్, డీటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

‘నవమి’ వేడుకలకు కోదండరామాలయం ముస్తాబు



విద్యుత్‌దీపాల వెలుగులో కోదండరామాలయం (ఇన్‌సెట్‌లో) ఆలయంలోని మూలవిరాట్

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలోని కోదండరామాలయం శ్రీరామ నవమి ఉత్సవాలకు ముస్తాబైంది. 1974లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చిన్న రాయిని పెట్టి శ్రీరాముడిగా పూజించాడు. అప్పటి నుంచి రాములవారు దినదినాభివృద్ధి చెందుతూ గ్రామస్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నాడు. గ్రామస్తుల సహకారంతో పచ్చని పచ్చదనం మధ్య ఆలయం ఆకట్టుకుంటోంది. శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. 31 ఏళ్లుగా గ్రామస్తులు శ్రీరాముడి మాలధారణ చేపడుతున్నారు. 41రోజులపాటు నియమనిష్టాలతో భక్తులు మాలలో ఉంటూ, స్వామివారిని పూజిస్తుంటారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ)లో ఉచిత శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్ (30 రోజులు) శిక్షణ ఏప్రిల్ 7న, బ్యూటీపార్లర్ (30 రోజులు) శిక్షణ ఏప్రిల్ 14న ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులకు ఉచిత శిక్షణతోపాటు ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పిస్తారని డైరెక్టర్ తెలిపారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువతులు (19 నుంచి 45 ఏళ్ల లోపు) అర్హులన్నారు. ఆసక్తి గలవారు తమ వెంట ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, 10వ తరగతి ధ్రువీకరణపత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 08461–295428ను సంప్రదించాలన్నారు.

ఘనంగా మెడికల్ కాలేజ్ స్నాతకోత్సవం



గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరను సన్మానిస్తున్న అధికారులు

నిజామాబాద్‌నాగారం: జిల్లాకేంద్రంలోని మెడికల్ కాలేజీలో శుక్రవారం రాత్రి 7వ స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మెడిసిన్ విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్‌లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జలగం తిరుపతి రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ రవికిరణ్, కళాశాల సూపరింటెండెంట్ నాగరాజు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో పలువురి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో హత్యాయత్నం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సౌత్ రూరల్ సీఐ సురేష్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని అక్బర్ కాలనీ (కెనాల్ కట్ట)లో సయ్యద్ పాషా కుటుంబంతో కలిసి ఉంటున్నారు. పాషా మనవరాలితో స్థానికుడైన సోహెల్ ఖాన్ కొన్నిరోజుల నుంచి అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో పాషా, అతడి భార్య ఈనెల 2న సోహెల్ ఇంటికి వెళ్లి అడుగగా, సోహెల్ కుటుంబసభ్యులు వారిని కొట్టారు. అనంతరం పాషా ఇంటి మీద దాడి చేసి పాషాతోపాటు అల్లుడు షేక్ గౌస్‌ను సోహెల్ కుటుంబసభ్యుడు ఆరిఫ్‌ఖాన్ కత్తితో పొడిచారు. దాడిలో షేక్‌గౌస్‌తోపాటు పరానా బేగం, సయ్యద్ ఫయాజ్‌లకు గాయాలైయ్యాయి. పాషా ఫిర్యాదు మేరకు ఆరిఫ్‌ఖాన్, సోహెల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బోధన్ మండలంలో..

బోధన్‌రూరల్: బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డయల్100కు కాల్ చేసి పోలీసుల సమయాన్ని దుర్వినియోగం చేసిన ఇద్దరు వ్యక్తులకు బోధన్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి తెలిపారు. సాలూర మండలంలోని హున్సా గ్రామానికి చెందిన బాలాజీ, బోధన్ మండలంలోని పెంటాకుర్దు గ్రామానికి చెందిన గంగారాం డయల్ 100కు ఫోన్ చేసి తప్పుడు సమాచారంతో పోలీసుల సమయాన్ని దుర్వినియోగం చేశారు. దీంతో ఎస్సై ఇద్దరిపై కేసు నమోదు చేసి బోధన్ కోర్టులో హాజరుపర్చగా, జడ్జి జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగిని గాయపరిచిన వ్యక్తికి జరిమానా

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ పీహెచ్‌సీలో ఏఎల్‌ఎంగా విధులు నిర్వర్తించే ఎండీ ఆరీఫ్ హుస్సేన్‌ను అదే గ్రామానికి చెందిన బండారి మాన్‌సింగ్ అలియాస్ రాహుల్ ఇటీవల గాయపర్చాడు. దీంతో అతడిని పోలీసులు పట్టుకొని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి విచారణ జరిపి అతడికి రూ.5వేల జరిమానా విధించినట్లు మెండోరా ఎస్సై నారాయణ తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో..

ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అనికేశి వెంకటేశ్, నల్లూర్ గ్రామానికి చెందిన నిఖిల్ ఇటీవల మద్యం తాగి వాహనం నడపడంతో పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఒక రోజు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బైరం రవీంద్ర వర్మ (37) ఈనెల 3న రాత్రివేళ జక్రాన్‌పల్లి మండలంలోని బాలనగర్ 44వ నంబర్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ మెంట్రాజ్‌పల్లికి వస్తున్నాడు. ఈక్రమంలో అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలాన్ని ఎస్సై తిరుపతి పరిశీలించి, క్షతగాత్రుడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గురువారం సాయంత్రం రవీంద్ర వర్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దూడ..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెల్లకుంటతండాలో విద్యుదాఘాతంతో ఆవుదూడ మృతిచెందింది. తండాలోని మూడ లక్ష్మణ్‌కు చెందిన దూడ శుక్రవారం మేత కోసం వెళ్లి తండాసమీపంలో గల ఎస్‌ఎస్–2 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. దీంతో దూడ అక్కడిక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి రవికుమార్ ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. దూడ విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. బాధిత రైతును ట్రాన్స్‌కో శాఖ ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ఒకరి మృతి కేసులో 9నెలల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి 9 నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. భిక్కనూర్‌కు చెందిన జమ్మగొని పోట్ల ముత్తాగౌడ్ కిరాణ దుకాణం నడుపుతూ జీవించేవాడు. గతేడాది ఓ రోజు రాత్రి అతడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బోయిని స్వామి అనే వ్యక్తి తన ఆటోను అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ముత్తాగౌడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. భిక్కనూర్ పోలీసులు కేసు నమోదు చేసి స్వామిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో కామారెడ్డి కోర్టు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దీక్ష నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు. సీఐ సంపత్ కుమార్, ఎస్సైలు రాజు, ఆంజనేయులు, పీపీ అశోక్ శివరాం నాయక్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, కానిస్టేబుల్‌రాజశేఖర్ గౌడ్‌లను ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌కు చెందిన దేవన్‌పల్లి సాకేత్ (19) తన స్నేహితుడు శివతో కలిసి స్కూటీపై హైదరాబాద్ బయలుదేరాడు. రామాయంపేట శివారులో వారి స్కూటీని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలవడంతో సాకేత్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ తీవ్రంగా గాయపడ్డాడు. సాకేత్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్యకేసులో ఒకరి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: ఇటీవల పాంగ్రాలో జరిగిన ఒంటరి మహిళ హత్య ఘటనలో నిందితుడిని పట్టుకొని, అరెస్టు చేసినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని పాంగ్రాలో చారుగొండ చంద్రకళ(55) ఒంటరిగా నివసిస్తుండగా, ఆమెకు కల్లు దుకాణంలో కామారెడ్డి జిల్లాలోని హరిజనవాడకు చెందిన శంషాబాద్ విజయ్ అలియాస్ విష్ణు అలియాస్ చింటూ పరిచయమయ్యాడు. గతనెల 23న ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించడానికి ఇంటికి వెళ్లి కల్లు తాగించాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు చెవికమ్మలు, మాటీలు, వెండి ఆభరణాలతోపాటు సెల్‌ఫోన్‌ను నిందితుడు తీసుకొని, వెంటతెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హత్యచేశాడు. అదే గ్రామంలోని ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌పై పారిపోయాడు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టగా, నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే అతడి వద్ద నుంచి ఏడు గ్రాముల బంగారం, 75 గ్రాముల వెండి, హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ శ్రీనివాసరాజు, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని సీపీ అభినందించారు.

వివిధ ఘటనల్లో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వరకు వ్యాపార సముదాయాలను తెరిచి ఉంచిన వారికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. నగరంలో గురువారం రాత్రి దుకాణ యాజమానులు సయ్యద్ తాజముల(గుల్జర్ పాన్ షాప్), నాదీముల్లా ఖాన్ (ఓల్డ్ పారడైస్ హోటల్), అమీర్ ఖాన్ (పాన్ షాప్, రైల్వేస్టేషన్), షేక్ షాబోద్దీన్, (ఎక్సెంట్ హోటల్, రైల్వేస్టేషన్) వ్యాపారాలు నిర్వహించడంతో పట్టుకున్నామన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు తెలిపారు. వీరిని జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని గోశాలరోడ్డులో రాత్రివేళ సమయం ముగిసినా హోటల్ నడుపుతున్న నిర్వాహకుడికి బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించాడని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. షేక్ ఖాజా అనే వ్యక్తి రాత్రి 10:30గంటల తర్వాత హోటల్ నిర్వహిస్తుండటంతో పోలీసులు పట్టుకొని, బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి జైలు శిక్ష విధించాడన్నారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజ్‌కుమార్ అనే వ్యక్తి డయల్100కు ఫోన్‌చేసి, న్యూసెన్స్ చేయడంతో అతడిని పట్టుకొని, కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. దీంతో ఆర్మూర్ సెకండ్ క్లాస్ జడ్జి అతడికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

మట్కా ఆడుతున్న వారికి..

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కాంపౌండ్ ఏరియాలో మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తులకు కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. గత నెల 22న మిర్చికంపౌండ్‌లో మట్కా ఆడుతున్న షేక్ జునేద్, కాశీపతి, ఇబ్రహీంలను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పర్చగా జడ్జి వారికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై ట్రాక్టర్ ప్రయాణం



ఎడపల్లి మండల శివారులో రైల్వే పట్టాలపై ట్రాక్టర్ ప్రయాణించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ఎడపల్లి మండలంలో రైల్వే పట్టాలపై పనులు జరగడంతో ట్రాక్టర్ సహాయంతో పట్టాలను తీసుకువచ్చారు. దీంతో పట్టాలపై ట్రాక్టర్ ప్రయాణించిన దృశ్యాలను ‘సాక్షి’ క్లిక్ మనిపించింది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

లోన్‌యాప్స్ వేధింపులకు యువకుడి బలి!

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లోన్‌యాప్స్ వేధింపులు తాళలేక మండలానికి చెందిన ఓ యువకుడు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్‌కు చెందిన నిమ్మలబోయిన సందీప్ (29) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటాడు. ఐదు నెలల క్రితం వివాహం చేసుకొని అక్కడే కాపురం పెట్టాడు. ఈక్రమంలో లోన్‌యాప్‌లో అప్పులు తీసుకోవడంతో వాటిని తీర్చాలని ఏజెంట్లు ఇంటికి వచ్చి ఒత్తిడి చేశారు. దీనికితోడు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టగా నష్టాలు వచ్చాయి. దీంతో సందీప్ కలత చెందాడు. అప్పులు తీర్చే మార్గంలేకపోవడంతో సందీప్ రెండురోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

శివాజీ విగ్రహావిష్కరణపై వివాదం



ఏర్గట్లలో పోలీసులతో స్థానికుల వాగ్వాదం



శివాజీ విగ్రహానికి వేసిన ముసుగు

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం వివాదానికి దారి తీసింది. ఏర్గట్లకు చెందిన కొన్ని యువజన సంఘాలు ప్రజల నుంచి విరాళాలు సేకరించి శివాజీ విగ్రహాన్ని తయారు చేయించాయి. బస్టాండ్ ప్రాంతంలోని తెలంగాణ తల్లి విగ్రహం పక్కన శివాజీ విగ్రహాన్ని నిలిపిఉంచారు. శుక్రవారం ఉదయం విగ్రహాన్ని ఆవిష్కరించి గద్దె నిర్మాణం పనులు ప్రారంభించారు. కానీ పోలీసులు వచ్చి విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని పనులను అడ్డుకున్నారు. ఎవరి అభ్యంతరం లేకపోయినా పోలీసులు అడ్డుకోవడంపై స్థానికులు నిరసన తెలిపారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు స్థానికులతో చర్చలను జరిపారు. 10 రోజుల్లో అనుమతి తీసుకోవాలని సూచించి, విగ్రహానికి ముసుగువేశారు. అనుమతి తీసుకున్న తర్వాతనే విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించడానికి యువజన సంఘాల సభ్యులు అంగీకరించడంతో వివాదం ముగిసిపోయింది. ఇదిలా ఉండగా ఆవిష్కరించిన రోజునే శివాజీ విగ్రహంపై ముసుగు వేయడం కాకతాళీయంగా చోటు చేసుకుంది.